క్లుప్తంగా

క్రిష్ణంగారిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు

తొండూరు : మండల పరిధిలోని క్రిష్ణంగారిపల్లె గ్రామంలో డాక్టర్ ఆరీఫుల్లా ఆధ్వర్యంలో ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్ ఉన్న వారికి నెలకు సరిపడే మాత్రలను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధడుతున్న వారి ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు జరిపారు.

ఆర్టీసీ పార్సిల్ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీ బస్సుల ద్వారా వచ్చే పార్సిల్, కొరియర్ సర్వీసుల కోసం ఏజెంట్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రవీన్ తెలిపారు. జమ్మలమడుగు, వద్దిరాల, పెద్దముడియం, మైలవరం, తిమ్మనాయునిపేటలలో పని చేసేందుకు అభ్యర్థులు ఈనెల 31వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శరవేగంగా శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ పనులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని భాకరాపురం రింగ్ రోడ్డు సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.8కోట్లతో ఆలయ నిర్మాణం, ప్రహరీ, గాలిగోపురం నిర్మాణ పనులు చేపట్టారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కూలీలతో రేయింబవళ్లు పనులు చేయిస్తున్నారు. సెప్టెంబర్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నా భూమి - నా దేశం ర్యాలీ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో నా భూమి - నా దేశం ర్యాలీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక పూలంగళ్ల నుంచి పాత ఆర్టీసీ బస్టాండు వరకు నిర్వహించారు. ఎంఈఓ వీరారెడ్డి, కౌన్సిలర్లు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి

చెన్నూరు : ఖరీఫ్–2023లో వేసిన పంటలకు రైతులు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమాన్ని ఇప్పటికే మండలంలో వ్యవసాయ సిబ్బంది ప్రారంభించారన్నారు. ఇప్పటివరకు 1200 ఎకరాలలో వరి, అలాగే ఇతర పంటలు రైతులు సాగు చేశారన్నారు. పంట వేసిన రైతులు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి ఈ పంట నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. పంట నష్ట పరిహారం, పంటల బీమా పరిహారం, అలాగే సున్నా వడ్డీ రాయితీ పొందేందుకు ఈ పంట నమోదు తప్పనిసరన్నారు.

కళాశాల సిబ్బందికి సత్కారం

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఫుడ్‌సైన్స్ కళాశాలలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ జి.శివరామిరెడ్డి, లైబ్రరీ సెల్ఫ్ అసిస్టెంట్ పి.కవితలు 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంచే ఉత్తమ అవార్డులు పొందారు. శనివారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అజ్మతుల్లా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

హస్త కళలను కాపాడుకుందాం

జమ్మలమడుగు : హస్త కళాకారులను ప్రోత్సహించి హస్త కళలకు జీవం పోయాలని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. శనివారం రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న వినాయకుడి మట్టి బొమ్మల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో సర్పంచ్‌గా బొలిశెట్టి మారుతి విజయం

కొలవలిలో వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలుపు

ముద్దనూరు: మండలంలోని కొలవలి గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించిన బొలిశెట్టి మారుతి ఘన విజయం సాధించింది. శనివారం జరిగిన ఈ ఎన్నికల్లో బొలిశెట్టి సుధామణిపై 589 ఓట్ల మెజార్టీతో ఆమె గెలుపొందారు. ఉదయం నుంచే భారీ సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పంచాయతీలో మొత్తం 1294 మంది ఓటర్లు ఉండగా 1123 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మారుతికి 846 ఓట్లు రాగా, సుధామణికి 257 ఓట్లు వచ్చాయి. 14 ఓట్లు చెల్లనివి కాగా, 4ఓట్లు



ధ్రువీకరణపత్రాన్ని అందుకుంటున్న మారుతి

నోటాకు, 2 ఓట్లు మంచం గుర్తుకు పోలయ్యాయని ఎన్నికల అధికారి సూర్యనారాయణరెడ్డి, రిటర్నింగ్ అధికారి వీరభద్రుడు తెలిపారు. మారుతి గెలుపుతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, అభిమానులు సంబరాల్లో పాల్గొన్నారు. తమ గెలుపునకు కృషి చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డిలకు మారుతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వరకుమార్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

బయనపల్లి 9వ వార్డు ఉప ఎన్నిక ఏకగ్రీవం



తుంగ కుమారి

చెన్నూరు : బయనపల్లె గ్రామ పంచాయతీలోని తొమ్మిదవ వార్డు ఉప ఎన్నికలలో తుంగ కుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి శకుంతల తెలిపారు. గతంలో సుబ్బరాయుడు అనే వ్యక్తి 9వ వార్డు మెంబర్‌గా కొనసాగుతుండగా, ఆయన మరణంతో ఉప ఎన్నిక జరిగిందని ఆమె పేర్కొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కి ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్, చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య, కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కొలానోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్ట్ జడ్జి ఎస్. భార్గవి పేర్కొన్నారు. శనివారం బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడి కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు.

గండి క్షేత్రం.. భక్తజన సంద్రం

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రావణ మాసం తొలి శనివారోత్సవం కావడంతో గండిక్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులు పాపాఘ్ని నదిలో స్నానమాచరించి ప్రశాంతంగా స్వామిని దర్శించుకొని తరించిపోయారు. ఆలయ మరమ్మతుల కారణంగా మూలవిరాట్‌కు బదులుగా బాలాలయంలో ధారువుతో ఏర్పాటు చేసిన విగ్రహాన్నే భక్తులు భక్తి శ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భగా స్వామి వారిని ఆలయ ప్రధాన ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో తగు ఏర్పాట్లు చేశారు. పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్, ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్ బందోబస్తు ఏర్పాటు చేశారు. చక్రాయపేట వైద్యాధికారి



గండి వీరాంజనేయ స్వామి ఆలయం

వాణి, వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు భక్తులు అన్నదానం నిర్వహించారు. తొలిశనివారం సుమారు 20 వేల మంది వరకు భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

అంజన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రావణ మాసం తొలిశనివారం సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు కనకదుర్గ, డీఎంహెచ్ఓ నాగరాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

పెద్ద జామియా మసీదును సందర్శించిన నంద్యాల ఎమ్మెల్సీ

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని పెద్ద జామియా మసీదును శనివారం వైఎస్సార్ సీపీకి చెందిన నంద్యాల ఎమ్మెల్సీ ఇషాక్ బాషా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను వైఎస్సార్‌సీపీకి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు సత్కరించారు. అనంతరం ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ నజీర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ముల్లా బషీర్, ముల్లా మహమ్మద్, ముల్లా ఖాదర్‌వలీ, ముల్లా బిలాల్, ముల్లా వలీ, ముల్లా ముజుబూర్, దాదా ఖలందర్, బాబా తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులతో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

జమ్మలమడుగు: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమణారెడ్డిల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు మానవత్వంతోపాటు విలువలతో కూడిన విద్యను నేర్పించాలని సూచించారు. అనంతరం ఉలవపల్లె గ్రామానికి చెందిన గోపిరెడ్డి వెంకటమ్మ, వెంకటరెడ్డిల జ్ఞాపకార్థం వారి మనువళ్లు మానవత సంస్థకు ఫ్రీజర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతోపాటు బైరెడ్డి రవీంద్రరెడ్డి, ఎస్వీ డిగ్రీకాలేజీ నాగేశ్వరరెడ్డి, బీటీ నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, పార్థసారధి, సంజీవరాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొప్పర్తి పంచాయతీ పరిధిలోని ఎర్రమాచుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, కో-కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, నాయకులు ఓబుల్‌రెడ్డి, నాగమల్లా రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం కచ్చితంగా అమలు కావాలి

చక్రాయపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం కచ్చితంగా అమలు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన మండలంలోని సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహదేవపల్లె విలేజ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి సమస్యలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సీహెచ్ఓ భార్గవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్, వైద్యాధికారి శివప్రసాద్, రమేష్‌రెడ్డి, ఏఎస్ఓ వెంకటరెడ్డి, ఏఎంఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు డీడీటీ పిచికారీ

సింహాద్రిపురం : బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అహోబిలాపురం గ్రామంలో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా జిల్లా మలేరియా వైద్యాధికారి మనోరమ ఆధ్వర్యంలో ఇంటింటా దోమల నివారణ కోసం డీడీటీ పిచికారీ చేసి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధుల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 229 డెంగీ, 7 మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. కేసులు నమోదైన గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఎంఎల్‌హెచ్‌పీ దిల్షాద్, ఆరోగ్య కార్యకర్త సుభాషిణి, ఆశా కార్యకర్త మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీ

జమ్మలమడుగు : ఈనెల 18వతేదీన ప్రకటించిన డిగ్రీ పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ డిగ్రీకాలేజి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కాలేజి ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డిలు పేర్కొన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కాలేజీలో వారు విలేకరులతో మాట్లాడుతూ తమ కాలేజి నుంచి బీఏ హెచ్ఈపీకి వందకు వందశాతం ఫలితాలు రావడంతోపాటు ఆరవ సెమిస్టర్‌లో బి.మానస, కె.శివనాగరాజు, సంజీవ ఈశ్వరరెడ్డి అఖిల్‌లు పదికి పది జీపీఏ సాధించారన్నారు. అలాగే వసంత కుమార్, పి.కరిముల్లా, షఫియా బేగం, పురుషోత్తం రెడ్డిలు ఆరవ సెమిస్టర్‌లో అత్యధిక మార్కులు సాధించిన జాబితాలో ఉన్నారన్నారు. నాలుగో సెమిస్టర్ బీఏలో ఎస్.ఇమ్రాన్ బాషా, ప్రసన్న కుమార్, రామతులసి, రెండో సెమిస్టర్‌లో ప్రియాంక, పార్థసారధి మంచి మార్కులు సాధించారన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

చక్రాయపేట : మామిడిలో రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని చీనీ నిమ్మ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సురభి గ్రామం కుప్పగుట్టపల్లె వద్ద జిల్లా ఉద్యాన అధికారి మైకేల్ రాజీవ్‌తో కలసి ఆయన మామిడి రైతులకు కాయకోత అనంతరం చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, బోడోఫేస్ట్ వాడకం తెగుళ్లు పురుగులు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయలు కోసిన అనంతరం 15 నుంచి 20 రోజుల పాటు చెట్లకు విశ్రాంతి ఇచ్చి కొమ్మ కత్తిరింపుల కార్యక్రమం చేపట్టాలన్నారు. సూక్ష్మధాతు మూలకాల లోపాలను నివారించేందుకు 5 గ్రాముల ఫార్ములా లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, మండల ఉద్యాన అధికారి రెడ్డెయ్య, ఉద్యాన సహాయకులు శ్రీకాంత్ వినోద్, శివలలిత, వ్యవసాయ సహాయకులు ముబారక్ బాష, శ్వేత, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

పులివెందుల రూరల్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న అమ్మ ఫొటో స్టూడియోలో ఫొటో రూపకర్త లూయీస్ డాగురే చిత్ర పటానికి ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అల్లా బకాష్, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, గౌరవాధ్యక్షులు శ్రీను, ప్రసాద్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంధుల ఆశ్రమం ట్రస్ట్ యజమాని రామ్మోహన్‌కు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు మస్తాన్, సురేంద్ర, హరి, ప్రసాద్, కృష్ణ, షాకీర్, బాషా, శివ, యోగి, రఘు, జగన్‌మోహన్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ ఒక కళ

కమలాపురం : ఫొటోగ్రఫీ ఒక కళ అని ఆ కళ మీ చేతుల్లోనే ఉందని స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పల్లా కృష్ణ తెలిపారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఫొటోగ్రఫీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్ ఉపయోగించి ప్రకృతిలో సహజసిద్ధంగా జరిగే మార్పులను అద్భుత సన్నివేశాలను చూపరులను ఆకట్టుకునే విధంగా మీ కెమెరాల్లో బంధించి పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. ఈ ఫొటోగ్రఫీ ఇన్‌చార్జి అశోక్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణం కడప రోడ్డులో ఉన్న హనుమాన్ నగర్ ఆర్ఆర్ లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి ధ్వజశిఖర కలశ, గణేష ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల విశేష పూజలు, హోమాలను వేదపండితుడు రాం కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం ధ్వజస్థంభ ప్రతిష్ట నిర్వహించారు.

వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

పెద్దరంగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కనుల పండువగా జరిగింది. గజ్జల వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు గజ్జల వెంకటసూరారెడ్డి, లక్ష్మికళావతి, పెద్దనాన్న వెంగల్‌రెడ్డి, లక్ష్మిదేవి దంపతులు ఆలయాన్ని నిర్మించారు.

ప్రారంభమైన శ్రావణమాస ఉత్సవాలు

పులివెందుల టౌన్ : శ్రావణమాసం తొలి శనివారం అంజన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి వీరాంజనేయస్వామి, కోతి సమాధి ఆంజనేయస్వామి, పీడబ్ల్యు కాలనీ ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ప్రత్యేక అలంకరణలో వృషభాచలేశ్వరుడు

వేంపల్లె : శ్రావణ మాస మొదటి శనివారం పురస్కరించుకుని స్థానిక వృషభాచలేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేసినట్లు ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్ పేర్కొన్నారు. ఆలయ అర్చకుడు హరి ప్రవీణ్ నేతృత్వంలో తోమాలలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అలంకరణతోపాటు అభిషేకం, కుంకుమార్చన, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

అంజన్న సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గండి వీరాంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఒంగోలు, ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విశ్వనాథరెడ్డి, మధుసూదన్, రాములు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భక్తులకు పలు సేవలు అందించారు.



ప్రత్యేక అలంకరణలో పడమటి ఆంజనేయస్వామి

ఆలయాల్లో శ్రావణ మాస పూజలు

సింహాద్రిపురం : నిడివెల్ల, గురిజాల, కసనూరు తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలను అర్చకులు నీటి శుద్ధి చేసి ఆంజనేయస్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

చింతకొమ్మదిన్నె : మండలంలోని అప్పరాజుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో మొదటి శ్రావణ శనివారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

పోటా పోటీగా బండలాగుడు పోటీలు

అప్పరాజుపల్లెలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో వృషభరాజములతో బండలాగుడు పోటీలను నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ మాస పూజలు

వీరపునాయునిపల్లె : సంగాలపల్లె గ్రామం వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయం, యస్.పాలగిరి, యరమలపల్లె, పోచంరెడ్డిపల్లె, వీరపునాయునిపల్లె గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో శ్రావణమాస పూజలు నిర్వహించారు.